మభ్యపడితే ఆగమైతం

- ఆర్ఎస్ పీని మెజారిటీతో గెలిపించుకుందాం..
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 27: కాంగ్రెస్, బీజేపీ మాటలతో మనం మభ్యపడితే ఆగమైతమని.. వారి మాటలు నమ్మొద్దని.. దేశ దిశాదశను మార్చేవి ఈ పార్లమెంట్ ఎన్నికలు కాబట్టి ఓటర్లు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఓటర్లతో పాటు కార్యకర్తలకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ పార్లీమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటన విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ముఖ్యకార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశం 50ఏండ్లు వెనక్కి వెళ్లిందన్నారు. 2014లో లీటర్ రూ.60 ఉన్న వంట నూనే ఇప్పుడు రూ.130కు తెచ్చారని డీజిల్, పెట్రోల్ ధరలు అలాగే పెరిగి పోయాయని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలనలో ధరల నియంత్రణన లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేస్తే సామాన్యుడు దేశంలో బతకలేని దుస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను చూస్తున్నాం.. కాంగ్రెస్ 100 రోజుల పాలన చూసి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఆరు గ్యారంటీలకు ఇప్పటి వరకు వారంటీ లేదన్నారు. కాంగ్రెస్ దొంగహామీలకు ప్రజలు మోసపోయారని ప్రస్తుతం ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మనం ఈ విషయాలను ప్రజలకు సరిగ్గా వివరిస్తే గెలుపు మనదేనన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ దేశం, ప్రజలు, రైతులకు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

రేపటినుంచి ఆర్ఎస్ పీ పర్యటన

గద్వాల నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ పీ 29న ఉదయం 6గంటలకు పట్టణంలో మార్నింగ్ వాకర్స్‌తో ప్రచారంలో పాల్గొంటారని, ఉదయం 8గంటలకు మల్దకల్ మండలం దాసరిపల్లిలో సవారమ్మ గుడిలో పూజా కార్యక్రమం, 9గంటలకు గద్వాల మండలం గోనుపాడులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి, అక్కడ నుంచి పాగుంటలో ప్రచారం చేస్తారని తెలిపారు. 10గంటలకు కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురంలో వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజ, 1గంటకు గట్టు మండల కేంద్రంలో, సాయంత్రం 5గంటలకు మల్దకల్ మండల కేంద్రంలో, రాత్రి 8గంటలకు ధరూర్ మండల కేంద్రంలో రోడ్ షోల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో ముఖ్యభూమిక

- అభివృద్ధి రాష్ట్రంగా నిలిపిన అధినేత కేసీఆర్
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భా వ వేడుకలు

వనపర్తి, ఏప్రిల్ 27: తెలంగాణ పునర్నిర్మాణంలో బీఆర్ఎస్‌దే ముఖ్యభూమిక అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఆవిర్భాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఆయన పాల్గొన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మలిదశ పోరాటంలో తెలంగాణ ఏర్పాటు కోసం కార్యదీక్షుడై కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీతో ప్రస్థానం మొదలు పెట్టారన్నారు. ఈ ప్రస్థానంలో కేసీఆర్ సారథ్యంలో పదేండ్ల పోరాటం తో రాష్ట్రం సాధించుకున్నామన్నారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటు మొదలు రాష్ట్రంలో సాగునీళ్లు, విద్యుత్ సమస్యలను అధిగమించి రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మలుచుకోవడంతో పాటు పారిశ్రామిక, ఐటీ రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించుకున్నామన్నారు. వ్యవసాయ రంగంలో 2 కోట్ల 50 లక్షల మందికి ఉపాధి అందించామని, అలాగే ఐటీ రంగంలో 6 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయన్నారు. 24గంటల విద్యుత్‌తో పారిశ్రామిక రంగం శరవేగం అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలల ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. పదేండ్ల ప్రస్థానాన్ని కనుమరుగు చేసేందుకు కేసీఆర్, రాష్ట్ర అభివృద్ధిపై కాంగ్రెస్ , బీజేపీ పార్టీలు చేసిన కుహన, కుట్రలను తెలంగాణ ప్రజలు గుర్తించలేక వారి మాయ మాటాలు, ప్రలోభాలకు మోసపోయారన్నారు. ఇప్పటికైనా పార్లమెంట్ ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకొని తెలంగాణ వాదాన్ని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత బైకని శ్రీనివాస్‌యాదవ్, నాయకులు లక్ష్మయ్య, లక్ష్మారెడ్డి, పలుస రమేశ్‌గౌడ్, నందిమల్ల అశోక్, విజయ్‌కుమార్, పరంజ్యోతి, మాధవరెడ్డి, సర్దార్‌ఖాన్, గులాం ఖాదర్, చంద్రశేఖర్, జాత్ర, జోహెబ్ పాల్గొన్నారు.

తెలంగాణకు శ్రీరామ రక్ష

అయిజ, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ తెలంగాణకు శ్రీరామ రక్ష అని పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిన్నరాముడు, వెంకటేశ్ పాల్గొన్నారు.

అయిజలో కేక్ కట్ చేస్తున్నబీఆ ర్ఎస్ శ్రేణులు

వనపర్తిలో బీఆర్ఎస్ జెండావిష్కరిస్తున్న మాజీమ ంత్రిని రంజన్‌రెడ్డి

తెలంగాణను సాధించిన బీఆర్ఎస్

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 27: ఇరవై మూడేండ్ల కింద ఇదేరోజు పుట్టిన తెలంగాణ రాష్ట్ర సమితి చిన్నచిన్న అడుగులతో ప్రారంభమై ఘనమైన విజయాలతో ముందుకెళ్లి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణను సాధించిందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ వేడుకలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, అనంతరం పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2001లో హైదరబాద్‌లోని కొండాలక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యంలో జయశంకర్‌సార్, కేసీఆర్ అధ్యక్షతన ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి బంగారు తెలంగాణగా రూపం ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. విజయపరంపరలో తెలంగాణలో వచ్చిన మార్పును దేశప్రజలకు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర సమితిని భారతరాష్ట్ర సమితిగా మార్చి ముందుకెళ్తున్న ప్రస్తుత పరిస్థితిలో మన పాత్ర కీలకమైందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీలు రాజారెడ్డి ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీలు ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, వైస్ చైర్మన్ బాబర్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, విక్రమసింహారెడ్డి, సత్యారెడ్డి, జంబు రామన్‌గౌడ్, రమేశ్‌నాయుడు, గోవిందు, సాయిశ్యాంరెడ్డి, కురుమన్న, సతీశ్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాల పార్టీ కార్యాలయంలో జెండావిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, ఏప్రిల్ 27: జిల్లాలో వచ్చే ఐదు రోజులు తీవ్రమైన వడగాలులతో పాటు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 45 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపు అవసరమైతే తప్పా ఎండలో బయటకు వెళ్లరాదని సూచించారు. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే తలకు టోపి, రుమాల, గొడుగులు వినియోగించాలన్నారు. శరీరంలో నీటిశాతం తగ్గకుండా రోజుకు కనీసం ప్రతిఒక్కరూ ఐదు లీటర్ల మంచినీటిని తీసుకోవాలన్నారు. వేసవిలో అత్యవసరమైతే తప్పా ప్రజలు ప్రయాణాలు చేయకూడదని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే తెల్లవారుజామున బయలు దేరేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రజలు నలుపు, ముదురు రంగు మందంగా ఉండే దుస్తువులు కాకుండా తెలుపు, లేత రంగు, వదులుగా ఉండే దుస్తువులు ధరించాలన్నారు. కాఫీ, టీలను ఎక్కువ వేడి సమయంలో తాగరాదని, మజ్జిగ, కొబ్బెరి బొండాలు తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. చిన్నారులు ఎండలో ఆడుకోవడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వారి శరీరాన్ని చల్లటి తడిగుడ్డతో శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల కంటే తక్కువ స్థాయి వచ్చేవరకు తుడవాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించాలన్నారు. వీరికి చికిత్స అందించేందుకు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు నీడ కల్పించడమే కాకుండా తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వృద్ధులు ఎండతో ఇబ్బంది పడకుండా నీడపట్టునే ఉండేలా చూసుకోవాలని వివరించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- రిటర్నింగ్ అధికారి మయాంక్ మిట్టల్

ఆత్మకూరు, ఏప్రిల్ 27: పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతులు కల్పించాలని జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మయాంక్ మిట్టల్ సూచించారు. శనివారం ఆత్మకూరు పట్టణంతో పాటు పిన్నెంచెర్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు తదితర వాటిని ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఎండలను దృష్టిలో ఉంచుకొని నీడ, తాగునీటి వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు రోజు ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని వారు రాత్రి బస చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. పిన్నెంచెర్ల గ్రామంలో ఓటర్ స్లిప్‌ల పంపిణీని పరిశీలించారు. గడువు లోపు ఓటర్ల ందరికీ స్లిపులు అందజేయాలని బీఎల్వోలకు సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ రాజు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్, మున్సిపల్ సిబ్బంది, బీఎల్వోలు ఉన్నారు.

నిర్లక్ష్యం వహించొద్దు

అమరచింత, ఏప్రిల్ 27: ఓటర్ స్లిప్పుల పంపిణీలో బీఎల్వోలు నిర్లక్ష్యం వహించొద్దని రిటర్నింగ్ అధికారి మయాంక్ మిట్టల్ అన్నారు. శనివారం ఆయన తాసీల్దార్ షేక్‌చాంద్‌పాషా, మున్సిపాల్ కమిషనర్ నూరుల్ నదీబ్‌తో కలిసి మండల కేంద్రంలోని డీఎంఆర్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ క్రేందాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకూర్ సీఐ శివకుమార్, అమరచింత ఎస్సై సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌నుప రిశీలిస్తున్నరి టర్నింగ్అధి కారి

రేపు ఓటరు చైతన్య శోభాయాత్ర

- 5వేల మందితో మెగా ర్యాలీ
- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, ఏప్రిల్ 27: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు బాధ్యత గుర్తు చేయడానికి ఈ నెల 29న చైతన్య శోభాయాత్ర నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఎం.నగేశ్, అన్ని శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు చైతన్య శోభయాత్ర పేరుతో ఈ నెల29వ తేదీ సాయంత్రం 5:30కి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం, ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం, టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణం నుంచి ఏకకాలంలో ర్యాలీలు ప్రారంభమై 6 గంటల వరకు పాలిటెక్నిక్ కళాశాల మైదానానికి చేరుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ ఎం.నగేశ్ పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది, లబ్ధిదారులతో మెగా ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఒక్కో ర్యాలీ కనీసం 2 వేల మందితో సంప్రదాయ వేషధారణతో నిర్వహించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు సహకరించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నాదే ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపడ్తున్నామన్నారు. ర్యాలీ సందర్భంగా బందోబస్తు చేపట్టాలని డీఎస్పీ వెంకటేశ్వర్లుకు సూచించారు. కనీస వసతులు కల్పించాలని మున్సిపాల్ కమిషనర్‌ను ఆదేశించారు. కవులు, కళాకారులు, యువత స్వచ్ఛంద సంస్థలు ఓటరు చైతన్య శోభయాత్రలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు పకడ్బందీగా చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి గౌరవ్

కేటీదొడ్డి, ఏప్రిల్ 27: సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి గౌరవ్ సూచించారు. మండలంలోని నందిన్నె చెక్‌పోస్టును శనివారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మద్యం, డబ్బు, బంగారం వంటివి వస్తే వెంటనే సీజ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

ఎక్సైజ్అధి కారులుసూ చనలిస్తున్న ఎన్నికలఅధి కారి గౌరవ్

విస్తృతంగా వాహన తనిఖీలు

- జోగులాంబ గద్వాల ఎస్పీ రితి రాజ్
- రూ.4,83,900 నగదు సీజ్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 27: ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేపడుతున్నట్లు ఎస్పీ రితి రాజ్ పేర్కొన్నారు. అందులో భాగంగా శనివారం జిల్లాలోని మనవపాడులో రూ.లక్ష, అయిజలోని మేడికొండ రోడ్డు లో రూ.69,500, ధరూర్ మండలంలోని నర్సన్‌దొడ్డి చౌరస్తాలో రూ.60వేలు, రాజోలి మండల కేంద్రంలో రూ.లక్షా2వేలు, గద్వాల మండలంలోని జమ్మిచేడు వద్ద రూ.52,400, ఉండవల్లి మండలంలోని పుల్లూరు చెక్ పోస్టు వద్ద రూ.లక్షా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా పట్టుకొన్నట్లు తెలిపారు. రూ.4,83, 900 సీజ్ చేసి గ్రీవెన్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, ఏప్రిల్ 27: మండలంలోని బుద్దారం గండి చెక్ పోస్టు వద్ద శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి తండాకు చెందిన మూడావత్ శ్రీను రూ.57,500 నగదుతీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదు లేక పోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురిటిలోనే పసికందు మృతి

గద్వాల అర్బన్, ఏప్రిల్ 27: పురిటిలోనే పసికందు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన గర్భిణికి పురిటినొప్పులు రావడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు వెళ్లారు. ఈ క్రమంలో గర్భంలోనే పసికందు మృతిచెందిందని, వెంటనే మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు వెళ్లాలని సూచించారు. బాధితులు జిల్లా కేంద్రంలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించి అపరేషన్ చేశారు. పసికందు మృతికి ప్రైవేట్ హాస్పిటల్ వైద్యులే కారణమంటూ దవాఖాన ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై దవాఖాన వైద్యులను వివరణ కోరగా.. బాధిత మహిళకు బీపీ ఉందని, బీపీ కారణంగానే గర్భంలో శిశువుకు ఇబ్బందులు రావడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు వెళ్లామని సూచించినట్లు తెలిపారు. పోలీసులను వివరాణ కోరగా తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదు రాలేదని సమాచారం అందించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గద్వాల అర్బన్, ఏప్రిల్ 27: అక్రమంగా మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అబ్కారీ శాఖ సీఐ గణపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ అదేశాల మేరకు అయిజ మండలంలోని పులికల్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన ఇద్దరు వేర్వేరుగా కర్ణాటక మద్యాన్ని బైక్‌పై తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. బైకులు, రూ.2లక్షలకుపైగా విలువ చేసే 24 కార్టన్ల మద్యం సీసాలను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై వీరేశ లింగం, సిబ్బంది వేణు, శేఖర్‌నాయుడు, చందు, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

- డీఆర్డీఏ ఏపీడీ నర్సింగరావు

గట్టు/వడ్డేపల్లి/ రాజోళి/మానవపాడు/ ఇటిక్యాల, ఏప్రిల్ 27: ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని డీఆర్డీఏ ఏపీడీ నర్సింగరావు అన్నారు. గట్టులో గ్రామ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యకళ, ఏపీఎం సాంబశివుడు, సీసీలు, గట్టు గ్రామ సంఘం అధ్యక్షురాలు శ్రీదేవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

అలాగే జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి, రాజోళి, మానవపాడు, ఇటిక్యాల మండలాల్లో తాసీల్దార్లు, ఎంపీడీవోలు, ఐకేపీ సిబ్బంది ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్భయంగా ఓటు వేయాలని అధికారులు సూచించారు.

రక్తదాన శిబిరం విజయవంతం

అమరచింత, ఏప్రిల్ 27: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో విద్యార్థులు శబరినాథ్‌గౌడ్, అక్షయ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పద్మ, కమలాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని నిలగిరి శాలిమఠం పీఠాధిపతి సూగురయ్యస్వామి ప్రారంభించగా 40 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తం సేకరించి దాతలకు ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నర్సింహులుగౌడ్, క్యామ భాస్కర్, మ్యాడం కృష్ణయ్య, లచ్చనగౌడ్, మహేందర్‌రెడ్డి, యువతి, యువకులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

గద్వాలటౌన్, ఏప్రిల్ 27: నచ్చిన రంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే చదివిన చదువుకు సార్థకత లభిస్తుందని ఎంఏఎల్డీ కళాశాల ప్రిన్సిపాల్ కలందర్‌బాషా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిణి మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం డిగ్రీ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వేడుకలకు ఆయనతోపాటు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి ఓ లక్ష్యం ఉండాలన్నారు. అప్పుడే జీవితంలో రాణిస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీసీ సభ్యుడు సాయిశ్యామ్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్, కృష్ణమూర్తి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

పాన్‌గల్, ఏప్రిల్ 27: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను, అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించి తీసుకెళ్లిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వేణు తెలిపారు. శనివారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, యువకుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వడ్డేపల్లి, ఏప్రిల్ 27: శాంతినగర్‌లో శనివారం అక్రమంగా తరలిస్తున్న 114 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్లు సీఐ రత్నం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. శాంతినగర్‌లోని కోయిలదిన్నె రోడ్డులో ఉన్న భాస్కర్ ఇంట్లో అంక్రమంగా నిల్వ ఉంచిన 221సంచుల్లో 114 క్వింటాళ్ల (62 క్వింటాళ్ల రైస్, 52 క్వింటాళ్ల నూకలు)ను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఇంటి యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గద్వాల అర్బన్, ఏప్రిల్ 27: చిన్న వయస్సులో పెండ్లిలు చేయడం చట్టరీత్యా నేరమని బాలల సంరక్షణ అధికారి నర్సింహులు పేర్కొన్నారు. శనివారం గద్వాల మండలంలోని కొత్తపల్లిలో మహిళా శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సంరక్షణ చట్టాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ చట్టాలు తదితర వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమనికి నర్సింహులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

VIVEKANANDA DEGREE COLLEGE
H.No.13-127, Registration Office Building, Bhagyanagar Colony,Shadnagar-509216.
E-mail: vivekananda.dc@gmail.com,CellNo: 9177993496, 7901333388

WANTED

Applications are invited from the following posts;
Principal: P.G. Ph D with minimum 55% of marks and 10 years of teaching Experience.
Lecturers : Commerce, Zoology, Botany, Physics, Chemistry, English, Telugu, Maths, Nutrition, and Computer Science.
Qualifications: PG in concerned subject with min. of 55% of marks.
Candidates may send their Bio Data within one week to the above address or mail with Xerox copies of certificates. They will be called for an interview.
-CORRESPONDENT

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

PLOT FOR SALE
★121 గజాలు ప్లాటు 3 లక్షలు, EMI రూ. 10,000/- ప్రతి నెల ఒకరికి ప్లాటు, ఎలక్ట్రిక్ స్కూటర్, గోవా టూర్ ఉచితంగా పొందండి. ఫోన్: 9128245456.
NT-97222

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

గోపాల్‌పేట, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోకు గోపాల్‌పేట, రేవల్లి మండలాల నుంచి బీఆర్ ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, నారాయణరెడ్డి నాయకులు బాలరాజు, రఘురామారావు, తిరుపతిరెడ్డి, శ్రావణ్‌కుమార్, రవి, శివరాంరెడ్డి, రాములు, శ్రీనివాసులు, మతీన్, మన్యం తదితరులు ఉన్నారు.

పెబ్బేరు మండలంలో..

పెబ్బేరు, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు పెబ్బేరు మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు తరలి వెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో తరలి వెళ్లారు.

వీపన్‌గండ్ల మండలం నుంచి

వీపన్‌గండ్ల, ఏప్రిల్27: రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు ప్రత్యేక వాహనాల్లో నాగర్‌కర్నూల్‌కు తరలివెళ్లారు.

చిన్నంబావి మండలంలో..

చిన్నంబావి, ఏప్రిల్ 27: మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, చిన్నారెడ్డి, తిరుపాల్, రామస్వామి, నాగేంద్రం, బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పాన్‌గల్ మండలం నుంచి

పాన్‌గల్, ఏప్రిల్ 27:ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ వెంకటయ్య నాయుడు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కందనూలుకు తరలివెళ్లారు.

వనపర్తి మండలంలో..

వనపర్తి, ఏప్రిల్ 27: మండలంలోని పెద్దగూడెం, కడుకుంట్ల, నాచహళ్లీ, రాజపేట, చిట్యాల, చిమనగుంటపల్లి తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీగా నాగర్‌కర్నూల్ కు తరలివెళ్లారు.

ఆర్ఎస్ పీకి మద్దతుగా ఇంటింటి ప్రచారం

గోపాల్‌పేట, ఏప్రిల్ 27 : రేవల్లి మండలం బండరావిపాకులలో శనివారం బీఆర్ఎస్ నాయకులు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పెబ్బేరు నుంచి తరలుతున్న కార్యకర్తలు

కేసీఆర్‌రో డ్‌షోకు వెళ్తున్నచి న్నంబావి మండల బీఆర్ఎస్ శ్రేణులు

బండరావిపాకులలో ప్రచారం చేస్తున్న గులాబీ పార్టీ నాయకులు